## క్లుప్తంగా

### మార్గదర్శకాలు పాటించాలి

గూడూరు: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సిబ్బంది నడుచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.ఆంజనేయ కుమార్ కోరారు. శుక్రవారం గూడూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ధాన్యం కొనుగోలు సిబ్బందికి ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ టెక్నికల్ అధికారి అఫ్రీన్ బేగం సిబ్బందికి సాంకేతికంగా పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు. టెక్నికల్ అధికారి అరుణ, పీఏసీఎస్‌ల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ

గూడూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌ను బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ శుక్రవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలలో భాగంగా స్టేషన్‌కు వచ్చిన డీఎస్పీకి గూడూరు ఎస్‌ఐ కేఎస్‌వీ.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం స్టేషన్‌లో రిజిస్టర్లు తనిఖీ చేసిన డీఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, ఎస్‌ఐ సత్యనారాయణ, ఏఎస్‌ఐ ఆర్.పి.స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

### 95.37 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నగరంలో నిర్వహించారు. నగరంలో మొత్తం 18,607 పింఛనుదారులు ఉండగా సాయంత్రానికి 17,746 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో 95.37 శాతం లక్ష్యాన్ని సాధించారు. నగరంలో తెల్లవారుజాము నుంచే ఇంటింటికీ సచివాలయ ఉద్యోగులు వచ్చి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. కాగా ఉదయం కొంతసేపు సర్వర్ ఇబ్బంది తలెత్తింది. దీంతో ఆందోళన చెందారు. సర్వర్ పనిచేయటంతో పింఛన్లను పంపిణీ చేశారు.

### హాకీ పోటీలకు ఎంపిక

గూడూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాజిల్లా అండర్- 17హాకీ జట్టుకు గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. బుధవారం పమిడిముక్కల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా జట్టు సెలక్షన్స్‌లో పాఠశాలకు చెందిన ఎస్.భరత్ కుమార్ (8వ తరగతి), వూసా హర్షవర్ధన్ (10వ తరగతి), టి.నాగేంద్ర వర్మ(10వ తరగతి), వి.హేమచంద్ర (10వ తరగతి) అత్యుత్తమ ప్రతిభ కనపర్చారు. ఈనెల 3 నుంచి నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం డి.పుష్పలత తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయులు మత్తి అరుణ, రాజేష్‌లను ఆమె అభినందించారు.

### ఇందిరాగాంధీకి నివాళి

మచిలీపట్నంటౌన్: భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని స్థానిక డీసీసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానిగా ఆమె పనిచేసిన కాలంలో పలు సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని వాటి ఫలితంగానే దేశంలో పేదరిక నిర్మూలన సాధ్యమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు కొడమంచిలి చంద్రశేఖర్, కోకా ఫణిభూషణ్, మతీన్, చిలుకోటి ప్రసాద్, మొహమ్మద్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

### చెరువు నీరు కలుషితం

బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరం రక్షిత మంచినీటి పథకం చెరువులో చేపలు చనిపోతున్న కారణంగా స్కీం ద్వార సరఫరా అవుతున్న నీరు దుర్గంధం వెలువడుతున్నదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని దాదాపు 14 గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే మల్లేశ్వరం రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. బంటుమిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.పవన్‌కుమార్ చెరువును సందర్శించి చెరువులో చనిపోయిన చేపలు ఉండటం గమనించి విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు.

### ఇరువురికి గాయాలు

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి 216 జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు కావడంతో ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రావివారిపాలెంకు చెందిన కన్న అశోక్‌వర్మ చల్లపల్లివైపు ద్విచక్రవాహనంపై వెళుతుండగా విశ్వనాథపపల్లికి చెందిన బత్తుల నాగసుధాకర్ ద్విచక్రవాహనంపై ఎదురుగా వస్తూ ఢీకొన్నారు. 108 వాహనంలో ఇరువురిని క్షతగాత్రులను అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి అశోక్ వర్మను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి నాగ సుధాకర్‌ను విజయవాడ హాస్పటల్‌కు తరలించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి

కోనేరుసెంటర్: గుండెపోటుతో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బత్తుల దాస్ (50) శుక్రవారం మృతి చెందారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న దాస్ ప్రస్తుతం పోలీసు క్యాంటీన్ బాధ్యతలు చూసుకుంటున్నారు. రెండు రోజుల క్రితం గుండెపోటు రావటంతో కుటుంబ సభ్యులు విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న దాస్ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలిసిన జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, ఇన్‌చార్జ్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్, ఏఆర్‌ఐ సతీష్ తదితరులు దాస్ మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు.

# ఇక్కడ కిలో అంటే 800 గ్రాములే

- రైతు బజారులో నయా వంచన
- పెడన రైతుబజారులో అంతా దళారులే.. రైతులు అంతంతే
- కిలోకు 200 గ్రాములు తక్కువగా తూకం
- కానరాని తూనికలు.. కొలతల శాఖాధికారులు
- చుట్టం చూపుగా వస్తున్న ఇన్‌చార్జి ఎస్టేట్ అధికారి
- లిఖితపూర్వక ఫిర్యాదులు బుట్టదాఖలు



పెడనలోని రైతు బజారు

పెడన: నియోజకవర్గంలో ఒకే ఒక రైతు బజారు పెడనలో మాత్రమే ఉంది. బంటుమిల్లి రోడ్డులోని పెడన వ్యవసాయశాఖ మార్కెట్ యార్డులో రైతుబజారును ఏర్పాటు చేశారు. ఇక్కడ సూపర్ వైజర్, క్లాస్ ఫోర్ ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఎప్పుడు ఉంటారో.. ఎప్పుడు ఉండరో కూడా ఎవరికీ తెలియని పరిస్థితి. తనిఖీ చేయాల్సిన ఎస్టేట్ అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో మచిలీపట్నం రైతు బజారు ఎస్టేట్ అధికారికి పెడన రైతు బజారు బాధ్యతలను అప్పగించారు. ఈయన పెడనకు అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటారు.

#### దుకాణాలు అధికం..

ఈ రైతు బజారులో బంటుమిల్లి, పెడన పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామస్తులు, చిల్లర కూరగాయాలు విక్రయించే వారు కొనుగోలు చేసి తీసుకువెళ్తుంటారు. రైతులకు దుకాణాలు కేటాయించి వారే నేరుగా మార్కెట్ చేసుకునే విధంగా ఈ రైతుబజార్లను ఏర్పాటు చేశారు. అయితే ఈ రైతు బజారులో దళారులే అధికంగా ఉన్నారనే విమర్శలున్నాయి. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో నయా వంచనకు తెరలేపారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

#### కిలోకు 200 గ్రాములు తక్కువగా..

రైతు బజారులో కిలో తూకం వేస్తే ఇళ్లకు తీసుకువెళ్లి చూస్తున్న చిల్లర దుకాణాదారులు కిలోకు 200 గ్రాములు తగ్గుతున్నాయని ఫిర్యాదులు చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ ఫిర్యాదులు బుట్టదాఖలా అవుతున్నాయి. కారణం అక్కడ సిబ్బంది దుకాణాదారులతో కలిసిపోవడమే. వీరు లేని సమయంలో దుకాణాదారులే రైతు బజారును చూసుకోవడం వంటి వాటి వల్ల దుకాణాదారుల చేతివాటం అధికమైంది.

#### తూనికలు, కొలతల శాఖ ఎక్కడ ఉందో..

తూనికలు..కొలతల శాఖ అధికారులు తనిఖీలను చేయకపోవడంతో తూకాలలో ఇష్టానుసారంగా ఉంటున్నాయి. తూకం రాళ్లు పాతవి ఉంటున్నాయని, ఇటీవల చాలా మంది ఎలక్ట్రికల్ తూకాలు వినియోగిస్తున్నారు. అయితే వీటిల్లోనే అధికంగా మోసాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

#### పట్టించుకోని రెవెన్యూ..

ఇన్‌చార్జి ఎస్టేట్ అధికారి ఉన్నా పట్టించుకోరు. తూనికలు, కొలతల శాఖాధికారులు కన్నెత్తి చూడరు. రైతుబజార్లకు జాయింట్ కలెక్టర్ సుప్రీం. అటువంటి రైతుబజార్లకు రెవెన్యూ అధికారులు కూడా తనిఖీలు చేయవచ్చు. ఈ విషయం చాలా మందికి తెలియక, తహసీల్దారుకు ఫిర్యాదులు చేయడం లేదు. దీంతో వారు కూడా రైతు బజారు వైపు రారు. ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి పరిస్థితులను పరిశీలించి రైతులకు, వినియోగదారులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

#### ఏదో ఒక రోజు వెళ్తుంటా..

తూకం తక్కువగా వస్తుందని నా దృష్టికి తీసుకురాలేదు. ఏదో ఒకరోజు మచిలీపట్నం రైతు బజారు నుంచి పెడనకు వెళ్తుంటా. వెళ్లిన సమయంలో ఫిర్యాదులు చేసిన దాఖలాలు లేవు. ఉన్న సిబ్బందిని అడిగితే ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెబుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేయలనుకుంటే నేరుగా 98666 54148కు సంప్రదించి ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటా. తూకాలను పరిశీలించడం జరుగుతుంది.

– అమీద్, ఇన్‌చార్జి ఎస్టేట్ అధికారి, పెడన

# పింఛన్ల పంపిణీని తనిఖీ చేసిన కలెక్టర్


గూడూరులో గౌరిపర్తి లక్ష్మణరావుకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ డి.కె.బాలాజీ

గూడూరు: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 7 గంటల సమయంలో గూడూరులో పర్యటించిన కలెక్టర్ యాదవుల రామాలయం ప్రాంతంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారులకు ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారులందరికీ పింఛన్లు అందజేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. జిల్లాలో నూరుశాతం పంపిణీ చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆమేరకు జిల్లా యంత్రాంగం పనిచేస్తుందన్నారు. ఎంపీడీఓ బి.రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి టి.వి.వి.భాస్కరరావు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పింఛన్ల కోసం ఐదేళ్ల తర్వాత మళ్లీ పడిగాపులు


పట్టణంలోని నాలుగో సచివాలయం పరిధిలో పింఛన్ల కోసం వేచి చూస్తున్న వృద్ధులు

పెడన: సామాజిక పింఛన్ల పంపిణీలో ఐదేళ్ల కిందట రోజులు గుర్తుకు వస్తున్నాయంటూ వృద్ధులు వాపోతున్నారు. శుక్రవారం ఉదయం పింఛన్ల పంపిణీ కార్యక్రమం వేకువ జామునే ప్రారంభించారు. ఉదయం 6.30 గంటల నుంచి సర్వర్లు పనిచేయడం మానేశాయి. సాంకేతిక లోపం తలెత్తడంతో సుమారు ఐదుగంటల పాటు వృద్ధులు, వితంతువులు పింఛను కోసం నిరీక్షించారు. ఐదేళ్ల కిందట పడిగాపులు పడ్డామని, ఇప్పుడు మళ్లీ పడుతున్నామని వాపోతున్నారు. వాలంటీర్లుంటే ఇంటికి తెచ్చి ఇచ్చేవారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం 12.10 గంటల నుంచి సర్వర్లు పనిచేయడంతో పింఛన్లు అందజేశారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధం

ఘంటసాలపాలెం(ఘంటసాల): మండలంలోని ఘంటసాలపాలెం గోటకం మాలపల్లిలో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా డాబా ఇల్లు కాలిపోయింది. ప్రమాద సమయంలో ఇంటి యజమానులు ఉప్పులేటి సుదర్శన్, లావణ్య దంపతులు ఇంటిలో లేరు. ఇంటిలో నుంచి భారీగా పొగలు, మంటలు కనిపించడంతో స్థానికులు సుదర్శన్ దంపతులకు సమాచారం అందించారు. ఇంటిలో సామగ్రి మొత్తం కాలి పోయాయి. రూ.1.50 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. మొవ్వ అగ్ని మాపక సిబ్బంది ప్రమాద స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు.

కోడూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వి.కొత్తపాలెం గ్రామానికి చెందిన గోవాడ లక్ష్మి పిల్లలతో కలిసి తనకున్న ఒంటి నిట్టాడి ఇంట్లో ఉంటుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. దీంతో లక్ష్మి బయటకు పరుగులు తీసింది. గృహం పూర్తిగా అగ్నికి అహుతైంది. ప్రమాదంలో రూ.50 వేల నగదు, 24 గ్రాముల బంగారం, 400 కేజీల మినుములు కాలిపోయినట్లు తెలిపారు. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. అవనిగడ్డ ఫైర్ సిబ్బంది ఘటనాస్థలంలో వివారాలు సేకరించారు.

గూడూరు: దీపావళి బాణాసంచాకు పోలవరంలో తాటాకు ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన యడవల్లి ఉమామహేశ్వరరావు స్థానిక శాంప్రసాద్ వీవర్స్ సొసైటీ సమీపంలోని తాటాకు ఇంట్లో అద్దెకు ఉంటూ హోటల్ నడుపుతున్నాడు. వారం రోజుల క్రితం హైదరాబాద్‌లోని తన కుమార్తె ఇంటికి వెళ్లాడు. గురువారం దీపావళిని పురస్కరించుకుని వెలిగించిన తారాజువ్వలు అదుపు తప్పి ఉమామహేశ్వరరావు ఇంటిపై పడ్డాయి. దీంతో ఇంటికి అంటుకున్న నిప్పు దావానంలా వ్యాపించి ఇల్లు, ఇంట్లోని గృహోపకరణాలు, బంగారు ఆభరణాలు మొత్తం కాలి బూడిదయ్యాయి. బందరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. దాదాపు రూ.4 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారులు నివేదిక సమర్పించారు.

# దీపావళి సెలవులో సిబ్బంది.. ఇసుక దోపిడీలో దళారులు

శ్రీకాకుళం వద్ద కృష్ణానదిలో ఇసుక దోపిడీ


శ్రీకాకుళం కృష్ణానదిలో ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళం కృష్ణానదిలో అనాధికారికంగా ఒక్కరోజు ఉచిత దోపిడి జరిగింది. శ్రీకాకుళం గ్రామంలోని కృష్ణానది లంక భూముల్లో వందలాది ట్రాక్టర్లతో దళారులు ఇసుక తవ్వకాలు చేపట్టారు. దీపావళి పండుగ రోజు కావడంతో అధికారులు ఎవరూ లేకపోవడంతో ఇదే అదునుగా కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు వందలాది ట్రాక్టర్లు శ్రీకాకుళం చేరుకున్నాయి. ఇసుక ట్రాక్టర్ నింపినందుకు ఇసుకను బట్టి రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేయడంతో పాటు బాట మెయింటెనెన్స్ కోసం రూ.100 అదనంగా వసూలు చేసినట్లు పలువురు ట్రాక్టర్ల డ్రైవర్లు చెబుతున్నారు. శ్రీకాకుళం కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం తెలుసుకుని ట్రాక్టర్లు వందలాదిగా చేరుకోవడంతో ఇసుక దళారులకు వరంగా మారింది. ఈ ఒక్క రోజులోనే సుమారు 800 పైగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించగా రూ.9 లక్షలకు పైగా వ్యాపారం జరిగినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి తహసీల్దార్ బి.కనకదుర్గను వివరణ కోరగా దీపావళి రోజున కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో వెంటనే వీఆర్వోను పంపించి ఇసుక తవ్వకాలను నిలుపదల చేయించినట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చే వరకు, కృష్ణానదిలో నీరు తగ్గే వరకు ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

#### ఆర్డీవో సందర్శన

శ్రీకాకుళం(ఘంటసాల): మండలం శ్రీకాకుళం గ్రామంలోని ఇసుక క్వారీని మచిలీపట్నం ఆర్డీవో స్వాతి శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలో ప్రభుత్వం తరుపున ఉచిత ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చిన రెండు ఇసుక క్వారీలను, స్టాక్ పాయింట్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్ బి.కనకదుర్గతో కలిసి పరిశీలించారు. అక్కడ పరిస్థితులను అధికారులను, సొసైటీ ప్రతినిధులు, కూలీలతో మాట్లాడారు. అనంతరం ఆర్డీవో స్వాతి మాట్లాడుతూ శ్రీకాకుళంలో ఇసుక క్వారీలకు అనుమతి ఇచ్చిన ప్రాంతంలో నీరు ఉందన్నారు. నీరు తగ్గేంత వరకు శ్రీకాకుళం ఇసుక క్వారీల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదన్నారు. నీరు తగ్గిన తర్వాత మాత్రమే ఇసుక తవ్వకాలు జరపాలన్నారు. శ్రీకాకుళం కృష్ణానదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసినా, అధికారులు అనుమతిచ్చిన ఇసుక రీచ్‌లో కాకుండా వేరే ప్రాంతంలో ఇసుక తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రీకాకుళం ఇసుక రీచ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తహసీల్దార్‌కు ఆర్డీవో వివరించారు. ఆర్‌ఐ కె.శ్రీనివాస్, సర్వేయర్ వల్లీపుష్ప, వీఆర్వో డి.గోపి, సిబ్బంది,

# రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని విస్మరిస్తే ఎలా?

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్నో పోరాటాలతో, మహనీయుల త్యాగాలతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. అటువంటి రోజును కనీసం జిల్లా యంత్రాంగం స్మరించటం మరిచింది. ఇలాంటి ఆశ్చర్యకర సంఘటన శుక్రవారం కృష్ణా జిల్లాలో చోటు చేసుకుంది. ఎంతో వైభవంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించేవారు. అటువంటి రోజున ఈ ఏడాది అధికారులు, నాయకులు సైతం విస్మరించటం విశేషం. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో కలెక్టర్, ఇతర అధికారులు శుక్రవారం సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఈ కార్యక్రమాన్ని విస్మరించారు. మంత్రి కొల్లు రవీంద్ర ప్రభుత్వ కార్యక్రమాలైన పింఛన్ల పంపిణీ, దీపం- 2 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని నగరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ పర్యటించి రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మరిచారు. ప్రభుత్వ యంత్రాంగంతో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు ఈ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు తప్ప అవతరణ దినోత్సవాన్ని నిర్వహించలేదు. కనీసం ఈ కార్యక్రమాల్లో గుర్తుచేసుకోకపోవటాన్ని తెలుగు భాషాభిమానులు, పొట్టి శ్రీరాములు అభిమానులు తప్పుపడుతున్నారు. ఇతర కార్యక్రమాల సందర్భంగా జిల్లా కోర్టు సెంటరులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించకపోవటం బాధాకరమని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న చిన్నా తదితరులు

పెడన: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాన్ని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి ప్రార్థనా మందిరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులన్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆత్మకూరి సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కేటీ మురళీకృష్ణ, కార్యదర్శి జవాజి నాగు తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం కృషిచేసిన పొట్టి శ్రీరాములు 55 రోజులపాటు ఆమరణ నిరాదీక్ష చేసి ప్రాణత్యాగం చేశారని మోపిదేవి జెడ్పీ పాఠశాల విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు కంఠంనేని కుటుంబరావు అన్నారు. మోపిదేవి ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద శ్రీరాములు, గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కోసూరువారిపాలెం మాజీ ఉప సర్పంచ్ కోసూరు రామాంజనేయులు, రావి సుధాకర్ రెడ్డి, ఆంజనేయులు, పలువురు అభిమానులు పాల్గొన్నారు.

### మంత్రి ఉన్నారంటూ ట్రాఫిక్ నిలిపివేత

మచిలీపట్నంటౌన్: మంత్రి కొల్లు రవీంద్ర గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం జరుగుతున్నంతసేపు పోలీసులు ఓవరాక్షన్ చేశారు. మంత్రి, నాయకులు పచ్చమేడ ప్రాంతంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు మచిలీపట్నం - చల్లపల్లి ప్రధాన రహదారిపై వారి వాహనాలను నిలిపి వెళ్లారు. దీంతో ఈ రహదారిలో పోలీసులు ద్విచక్రవాహనాలను మినహా మిగిలిన వాహనాలను వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. మంత్రి కార్యక్రమం జరిగినంత సేపు పోలీసులు ఈ ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలు నిలిపివేయటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రహదారిలో జవ్వారుపేట సెంటర్ నుంచి ముందుకు వెళ్లనివ్వకుండా పక్కనున్న రహదారుల ద్వారా వెళ్లాలని సూచించారు. దీంతో వాహనాదరులు ప్రధాన రహదారి కాకుండా ఇతర మార్గాల నుంచి గమ్యస్థానాలకు వెళ్లాల్సి వచ్చింది. మంత్రి కార్యక్రమాలు జరిగినప్పుడల్లా ట్రాఫిక్ సమస్య ఎదురవుతోందని వాపోతున్నారు.

### నాయీ బ్రాహ్మణుల నిరసన

బంటుమిల్లి: స్థానికంగా ఇతర కులానికి చెందిన వ్యక్తి బార్బరు షాపు పెట్టి మా పొట్ట కొట్టే ప్రయత్నాలను అడ్డుకుని కుల వృత్తిని కాపాడాలని కోరుతూ శ్రీ వినాయక నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు కుల వృత్తులను కాపాడుతూ చట్టం చేశాయని, అలాగే నాయీ బ్రాహ్మణ సంఘం కుల వృత్తిని కాపాడటానికి చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. మాకు పోటీగా రక, రకాల సౌకర్యాలతో ఇతర కులాలవారు బార్బరు షాపులు పెట్టి వినియోగదారులను ఆకర్షిస్తే నాయి బ్రాహ్మణ కుటుంబాలు పస్తులు ఉండాల్సి వస్తుందని సంఘ సభ్యులు విచారం వ్యక్తం చేశారు. సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ వీవీ. భరత్‌రెడ్డికి, ఎస్‌ఐ గణేష్‌కుమార్‌లకు వినతి పత్రం అందజేశారు. సంఘ సభ్యులు డి.రవికుమార్, ఎం.వి.శివరామ్, పి.వెంకన్న, ఎంఎస్.కుమార్, శివ, సాయి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# పంటలను నాశనం చేస్తున్న ఆవుల కట్టడికి వినతి

పెడన: పట్టణ శివారులోని వరి పంట పొలాలను ఆవులు నాశనం చేస్తున్నాయని, వాటి వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయానికి రైతులు చేరుకోవడంతో చైర్‌పర్సన్ ఛాంబరులో కటకం ప్రసాద్ రైతుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పట్టణంలో చాలా మంది ఆవులను కట్టేయకుండా వదిలేస్తుండటంతో పగలు, రాత్రి తేడా లేకుండా పంట పొలాలపై పడి పంటను నాశనం చేస్తున్నాయన్నారు. పగలు కాపాలా ఉంటున్నా రాత్రి సమయంలో మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ప్రధాన రహదారిలో కూడా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయని, ఇదే పరిస్థితి ఉంటే తాము పంటను కోల్పోయి తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ గోపాలరావు మాట్లాడుతూ పశుయాజమానులు తమ ఆవులు, గెదేలను ఇళ్ల వద్ద కట్టేసుకోవాలని సూచించారు. రోడ్లు వెంబడి సంచరిస్తూ కనిపిస్తే బందులదొడ్లో ఉంచుతామన్నారు. రెండు రోజుల్లో సజాయిషీ ఇచ్చి విడిపించుకోకపోతే మాత్రం గోశాలకు తరలిస్తామని కమిషనర్ పశువుల యాజమానులను హెచ్చరించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు శిరివెళ్ల జేయేష్, కో ఆప్షన్ కౌన్సిలర్ వీరంకి నరసింహారావు రైతులు పాల్గొన్నారు.

### బాధితుడికి ఆర్థిక సాయం

చిట్టూర్పు(ఘంటసాల): ఆపదలో ఉన్న వ్యక్తులకు తనవంతు సహకారం అందిస్తున్నట్లు పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చిట్టూర్పు పంచాయతీ శివారు జోడుగూడెంకు చెందిన చిట్టూరి లోకేశ్వరరావు ఇటీవల వక్కలగడ్డ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న లోకేశ్వరరావు ఉపాధి కోల్పోయాడు. సమాచారం తెలుసుకున్న పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ శుక్రవారం లోకేశ్వరరావును పరామర్శించి రూ.10 వేల నగదును అందించారు. విక్కుర్తి రాంబాబు, పురిటిగడ్డ చంద్ర, భూపతి నాంచారయ్య, రేపల్లె మునసయ్య, దోనె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### ఇంటింటా దీపావళి వెలుగులు



కోడూరు/మచిలీపట్నం/కృత్తివెన్ను/నాగాయలంక/మోపిదేవి/ఘంటసాల: దీపావళి పర్వదినాన్ని ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య కనులపండువగా జరుపుకున్నారు. గురువారం లక్ష్మీదేవికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సమీప దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. సాయంత్రం ఇళ్ల ముంగిట్లో అందమైన రంగవల్లులు తీర్చిదిద్ది, అందులో దీపాలు వెలిగించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ టపాసులు కాలుస్తూ సందడి చేశారు. టపాసుల విక్రయ కేంద్రాల వద్ద కూడా ప్రజలు సందడి అధికంగా కనిపించింది. ఆయా ప్రాంతాల్లో టపాసుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయగా, వీటి ద్వారా కోట్లలో వ్యాపారం జరిగింది. పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.



### అగ్నిప్రమాద బాధితులకు సాయం

పర్రచివర(నాగాయలంక): మండల పరిధిలోని పర్రచివర శివారు దుర్గాప్రసాద్‌పురంలో గురువారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మెండు నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని శుక్రవారం పలువురు పరామర్శించి సాయం అందించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నాగాయలంక సబ్‌బ్రాంచ్ చైర్మన్ శివవిష్ణు, సంస్థ సభ్యులు ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం, పూర్తి వంట సామగ్రి, హైజనిక్ కిట్ బాధితులకు అందచేశారు. నియోజకవర్గం జనసేన యువనేత మండలి వెంకట్రామ్, మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు(చంటి) రూ.5 వేల చొప్పున నగదు, దుప్పట్లు, దుస్తులు అందించారు. తొలుత తహసీల్దార్ ఎం.హరనాథ్ ఆధ్వర్యంలో బియ్యం, నూనె అందించారు. అవనిగడ్డకు చెందిన వైఎస్సార్ సీపీ యువనేత బడే గౌతమ్ బాధితులను పరామర్శించి బియ్యం, నిత్యావసర సరకులను అందజేశారు.

### పేర్ని ఇంట దీపావళి వేడుక


టపాసులు కాలుస్తున్న పేర్ని నాని, కుటుంబ సభ్యులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) నివాసంలో గురువారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తనయుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఆయన సతీమణి జయసుధలతో కలిసి టపాసులు కాల్చారు. ఈ దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

### మాజీ ఎంపీ బుచ్చికోటయ్య వర్ధంతి

అవనిగడ్డ: మాజీ పార్లమెంట్ సభ్యుడు సనకా బుచ్చికోటయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఎస్‌బీకే భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఎస్‌బీకే ట్రస్ట్ కన్వీనర్ సనకా ఛూటే, కమ్యునిస్టు పార్టీ సీనియర్ నాయకులు మారుబో యిన పులేంద్రరావు బుచ్చికోటయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బచ్చికోటయ్య చేసిన సేవలను కొనియాడారు. పరుచూరి ప్రేమ్‌బాబు, కన్నా రాజు, మెండు బాలకృష్ణ, పంచకర్ల నాంచారయ్య, చింతా వెంకటరాజు పాల్గొన్నారు.

### మీడియా పాత్ర గొప్పది

కోనేరుసెంటర్: దీపావళి పండుగ పాత్రికేయుల జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్‌రావు కాంక్షించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని గురువారం ఆయన మచిలీపట్నం పాత్రికేయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా పనిచేస్తూ సమాజంలో జరుగుతున్న మంచి చెడులను తెలియజేయటంలో మీడియా పాత్ర ఎంతో గొప్పదన్నారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు చెబుతూ పాత్రికేయ మిత్రులకు దీపావళి శుభాకాంక్షలను తెలియజేశారు. ఇన్‌చార్జ్ అడిషనల్ ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.